ఆత్మకూర్.ఎస్ : పాతర్లపహాడ్‌లో పశు వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ కుమారస్వామి

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

● జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కుమారస్వామి

ఆత్మకూర్.ఎస్, మార్చి 30 : పశువుల పెంపకందారులు తమ పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కుమారస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో పశువులకు ఉచితంగా చేపట్టిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 410 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాలరావు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేసినట్లు గరిడేపల్లి వైద్యాధికారి సీహెచ్.నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు పెంపకందారులు తప్పక గాలికుంటు నివారణ టీకాలను తమ పశువులకు వేయించాలన్నారు. 4 ఆవులకు, 125 బర్రెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది నజీర్, రజిత, శేఖర్, అజహర్ పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

● తాసీల్దార్ సంఘమిత్ర



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాసీల్దార్ సంఘమిత్ర

మోతె, మార్చి 30 : రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తాసీల్దార్ సంఘమిత్ర తెలిపారు. శనివారం మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర రూ.2,203, బీ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర రూ.2,183 చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం కనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ అరుణ, ఏఈఓ కార్తీక్, క్లస్టర్ అధికారి అశోక్, మానిటరింగ్ అధికారి కమలాకర్, ఆర్ఐ అజయ్, సంఘ సీఈఓ బానాల అనంతరెడ్డి, సిబ్బంది శ్రీను, మధు, సతీశ్, రైతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి వైభవంగా తిరువీధి ఉత్సవం

● పాల్గొన్న మైహోం చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు



పూజలో పాల్గొన్న మైహోం చైర్మన్ రామేశ్వర్‌రావు

మేళ్లచెర్వు, మార్చి 30 : స్థానిక మైహోం ఇండస్ట్రీస్ ఆవరణలో కొలువై ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారికి తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుప్పావై సేవా కాలం, సహస్ర కమలార్చన, ధ్వజారోహణం, భేరీ పూజ, దేవతాహ్వానం తదితర కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళశాసనాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమాల్లో పరిశ్రమ చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు-శ్రీకుమారి దంపతులు, మునగాల రామ్మోహన్‌రావు-అరుణ, ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్‌రావు

ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి

● రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్‌రావు

కోదాడ రూరల్, మార్చి 30 : యాసంగి సీజన్‌లో ఎండిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో రైతు సంఘం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఎడమ కాల్వ నీటి విడుదల చేయకపోవడంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్ర నష్టానికి గురైనట్లు తెలిపారు. అధికారులు పంటలను పరిశీలించి ఎకరానికి రూ.30 వేల పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏనుగుల వీరాంజనేయులు, నెమ్మాని సంగమయ్య, గొర్రెముచ్చు మరియన్న, పట్టణ కార్యదర్శి ఎం.ముత్యాలు, కె.వెంకటేశ్, జి.నాగరాజు, సైదులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు సగం స్థానాలు ఇవ్వాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, మార్చి 30 : పార్లమెంట్ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు సగం ఎంపీ స్థానాలను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో బీసీలకు రెండు అసెంబ్లీ టికెట్లు ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. సబ్బండ కులాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలను కాదని ఇతర పార్టీల్లో ఉన్న అగ్రకులాలకు టికెట్లు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ 17 పార్లమెంట్ స్థానాలకు ఆరు స్థానాలను బీసీలకు ఇచ్చిందని, కాంగ్రెస్ 12 స్థానాలను ప్రకటిస్తే బీసీలకు మూడు సీట్లు మాత్రమే ఇచ్చిందని అన్నారు. మరో ఐదు స్థానాలను బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో కుల పాలన చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇదే వైఖరి అవలంబిస్తే కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

తప్పిపోయిన మహిళ బంధువులకు అప్పగింత

మాడ్గులపల్లి, మార్చి 30 : తప్పిపోయిన మహిళను పోలీసులు ఆమె బంధువులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. ఓ మహిళ తప్పిపోయి శనివారం మండలంలోని చెర్వుపల్లికి రాగా, స్థానికుల సమాచారంతో పోలీసులు ఆమె నుంచి వివరాలు సేకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండకు చెందిన మహిళగా గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఇక్కడికి రప్పించి అప్పగించారు.

కార్యకర్తల కష్టంతోనే అధికారంలోకి కాంగ్రెస్

● ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి
● మట్టపల్లిలో నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం
● పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు
● ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపునకు పిలుపు

సభా వేదిక పైనుంచి అభివాదం చేస్తున్న ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపా దాస్ మున్షి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, తదితరులు

నేరేడుచర్ల, మార్చి 30 : పార్టీ కార్యకర్తలు, నాయకులు శ్రమించి చమట చిందించడం వల్లే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపా దాస్ మున్షి అన్నారు. శనివారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠపల్లి లక్ష్మీనర్సింహాస్వామి సన్నిధిలో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏ విధంగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకవచ్చారో అలాగే శ్రమించి కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని కూడా దేశ చరిత్రలో నిలిచిపోయేలా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏ మోహం పెట్టుకుని రాష్ట్రంలో ఓట్లు అడుగుతదని ప్రశ్నించారు. కాజీపేట్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యరంలో స్టీల్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్, తెలంగాణకు సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఇవ్వలేదన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి దివాలా తీయించారని మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావడం కోసం మత ఘర్షణలను సృష్టించాలని చూస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మంత్రులందరం కలిసి పని చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి తనకు గురువు అన్నారు. తనతో 42 ఏండ్లుగా మంచి సంబంధాలున్నట్లు తెలిపారు. జానారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తాను నిరంతరం శ్రమించినట్లు చెప్పారు. కార్యకర్తలు కష్టపడి రఘువీర్‌ను ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూస్తానన్నారు. తొలుత నాగార్జున స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద దిగిన మంత్రులు నేరుగా లక్ష్మీ నర్సింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, కుందూరు జయవీర్‌రెడ్డి, కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్ రెడ్డి, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి అల్లం ప్రభాకర్‌రెడ్డి , సూర్యాపేట, నల్లగొండ జిల్లాల అధ్యక్షులు చెవిటి వెంకన్న, శంకర్‌నాయక్, మహిళా అధ్యక్షురాలు అనురాధ, మాధవి, రాష్ట్ర నాయకులు జిన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఐన్‌టీయూసీ జిల్లా నాయకుడు ఎరగాని నాగన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోదాడ టౌన్, మార్చి 30 : కోదాడ పట్టణ పరిధి నయానగర్, భవానీనగర్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు 11 కేవీ లైన్‌లో మరమ్మతులు ఉన్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ శ్రీనివాస్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

3న నూతనకల్ మండల సర్వసభ్య సమావేశం

నూతనకల్, మార్చి 30 : ఏప్రిల్ 3న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సునీత తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో, సకాలంలో హాజరు కావాలన్నారు. అలాగే ప్రజా ప్రతినిధులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు కంటి వైద్య శిబిరం

బొడ్రాయిబజార్, మార్చి 30 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏప్రిల్ 1న సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎస్.నాగేశ్వర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు, ఆరోగ్య శ్రీ కార్డు ఉన్నవారు, జర్నలిస్టులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9951020552 నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే పోలీస్ కవాత్

● ఎస్ఐ రవీందర్‌నాయక్

నేరేడుచర్ల, మార్చి 30 : శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీస్ కవాత్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. శనివారం సాయంత్రం నేరేడుచర్లలో పారా మిలటరీ సిబ్బందితో కలిసి పట్టణ పుర వీధుల్లో పోలీస్ కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చారీ, పోలీస్ సిబ్బంది, పారా మిలటరీ బృందం పాల్గొన్నది.

మా బడి జ్ఞాపకాల ఒడి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

'మా బడి జ్ఞాపకాల ఒడి' పుస్తకావిష్కరణ

కోదాడ రూరల్, మార్చి 30 : ప్రాథమిక విద్యార్థి దశలోని జ్ఞాపకాలను యాజమాన్యం పుస్తకంగా రూపొందించడం అభినందనీయమని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ పరిధి కోమరబండ తేజ విద్యాలయంలో నిర్వహించిన 'మా బడి జ్ఞాపకాల ఒడి' పుస్తకావిష్కరణలో ఆయన మాట్లాడారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ పుస్తకం విద్యార్థులకు వారి జీవితకాల బహుమతి అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీని ఓడించాలి

● సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి శివకుమార్

నేరేడుచర్ల, మార్చి 30 : మతతత్వ బీజేపీని జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు. శనివారం నేరేడుచర్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ మతాన్ని, కులాన్ని పెంచి పోషిస్తూ విద్వేషాన్ని పెంపొందిస్తున్నదని దుయ్యబట్టారు. రాముడు పేరుతో రాజకీయం చేస్తూ మైనార్టీలను, దళిత, బహుజనులకు ఈ దేశంలో జీవించే హక్కును కోల్పోయేలా చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కన్వీనర్ వాసా పల్లయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, ఏఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకుడు వాస కరుణాకర్, పీఓడబ్ల్యూ నియోజకవర్గ కన్వీనర్ సందా సత్తెమ్మ పాల్గొన్నారు.

నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్

తిరుమలగిరి : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు పోరెల్ల దాసు స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో దాసు ఆరో వర్ధంతి సందర్భంగా ఆయన ఫ్లెక్సికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి వెల్లి ఉప్పలయ్య, కడెం లింగయ్య, చిత్తలూరు సోమయ్య, కొత్తగట్టు మల్లయ్య, కందుకూరి సోమయ్య, తన్నీరు రాంప్రభు, కిష్టు నాయక్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వు నాగుల చెరువు (నాడు-నేడు)

మేళ్లచెర్వు, మార్చి 30 : మండల కేంద్రంలోని 1,530 సర్వే నంబర్‌లో 40.01 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నాగుల చెరువు కింద గతంలో సుమారు 230 ఎకరాలకు పైగా సాగయ్యేది. అయితే పూడిక పేరుకపోవడంతో సగం లక్ష్యం కూడా నెరవేరక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. తొలి విడుత మిషన్ కాకతీయలో భాగంగా మేళ్లచెర్వు నాగుల చెరువుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.64.85 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పునరుద్ధరణ పనులు చేపట్టడంతో చెరువుకు మహర్దశ పట్టింది. గతేడాది నిండుకుండలా ఉన్న ఈ చెరువు ప్రస్తుతం పూర్తిగా అడుగంటింది. ఇప్పటికే గ్రామంలో భూగర్భజలాలు పడిపోయి ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి తాపం పెరిగితే పరిస్థితులు ఎలా ఉంటాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మాలల పట్ల మాదిగల ధోరణి మారాలి : తలమల్ల హసేన్

సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్

బొడ్రాయిబజార్, మార్చి 30 : కొన్నేండ్లుగా మందకృష్ణ మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు పలువురు మాల సమాజానికి వ్యతిరేకంగా మాట్లాడడాన్ని మాల మహానాడు తీవ్రంగా ఖండిస్తున్నదని, మాల సమాజం పట్ల మాదిగ నాయకులు ధోరణి మార్చుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్ అన్నారు. శనివారం కుడకుడలో ఏర్పాటు చేసిన మాల మహానాడు అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్‌లన్నీ మాల కులమే అనుభవిస్తున్నదని, రాష్ట్ర జనాభాలో 60 లక్షల జనాభా ఉన్న మాల కులం వారిని 18 లక్షలుగా తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. దళిత వ్యతిరేకి అయిన బీజేపీకి ఓటు వేయాలని మందకృష్ణ మాదిగ తమ కులస్తులను కోరడం మంచిది కాదన్నారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా గౌరవాధ్యక్షుడు గోపయ్య, న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సయ్య పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు లక్ష్మమ్మ మృతి

మోతె, మార్చి 30 : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన కాకి లక్ష్మమ్మ (80) శనివారం తెల్లవారుజామున ఆనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని సీపీఎం మండల కమిటీ సభ్యుడు పోమగాని మల్లయ్య, గ్రామ కార్యదర్శి ఎర్రబోయిన మల్సూర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండలాధ్యక్షుడు వెలుగు మధు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు ములకలపల్లి మల్సూర్, నాగయ్య, పోడపంగి ఈదయ్య పాల్గొన్నారు.

రామచంద్రయ్య మృతి తీరని లోటు

గరిడేపల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మండలంలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన చింతకాయల రామచంద్రయ్య మృతి తీరని లోటు అని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ అన్నారు. రామచంద్రయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. రామచంద్రయ్య తెలంగాణ పోరాటంలో మేదరమెట్ల సీతారామయ్య, యరబోలు లచ్చిరెడ్డితో కలిసి పాల్గొన్నట్లు తెలిపారు.

బొడ్రాయిబజార్ : రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

రన్ ఫర్ జీసస్

బొడ్రాయిబజార్, మార్చి 30 : సూర్యాపేట సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో శనివారం ఉదయం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ డాక్టర్ ఎం.ప్రభుదాస్, సూర్యాపేట పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మన్ మామిడి శ్యామ్‌సన్, జిల్లా ఎన్నికల చైర్మన్ జాకబ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబూరావు, పట్టణ సలహాదారుడు జోహర్‌పాల్, పట్టణ అధ్యక్షుడు జలగం డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు. నేరేడుచర్ల : గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలను పురస్కరించుకుని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ ప్రారంభించారు. నేరేడుచర్ల ఎంపీడీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ రన్ పట్టణ పురవీధుల్లో గుండా కొనసాగింది. కార్యక్రమంలో జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాపోలు నవీన్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.ధనుంజయనాయుడు, కర్రి సతీశ్‌రెడ్డి, పాల్గొన్నారు.

మునగాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి శిరీష

గరిడేపల్లి : కేజీబీవీ నుంచి సంతోషంగా ఇంటికి వెళ్తున్న పదో తరగతి విద్యార్థినులు

ముగిసిన పదో తరగతి పరీక్షలు

గరిడేపల్లి, మార్చి 30 : ఈ నెల 18న తెలుగుతో ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం సాంఘికశాస్త్రంతో ముగిశాయి. చివర రోజు పరీక్షలు రాసిన తర్వాత విద్యార్థులు చిరునవ్వులు చిందిస్తూ ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకుని ఇంటిదారి పట్టారు. స్థానిక కేజీబీవీ హాస్టల్‌లోని విద్యార్థినులు ఇన్నేండ్ల అనుబంధాలను గుర్తు చేసుకుంటూ తమ సామగ్రిని తీసుకుని ఆనందానుబూతులతో ఇండ్లకు తరలివెళ్లారు. మునగాల : మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలు జడ్పీ ఉన్నత పాఠశాల, న్యూ ప్రజ్ఞ పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి, జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, మునగాల ప్రత్యేక అధికారి, తాసీల్దార్ ఆంజనేయులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేశ్ దీన్ దయాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ లేని సమాజాన్ని కోరిన వేగుచుక్క భగత్‌సింగ్

● సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు డేవిడ్‌కుమార్

ఏపూరులో మాట్లాడుతున్న డేవిడ్‌కుమార్

ఆత్మకూర్.ఎస్, మార్చి 30 : స్వాతంత్ర్యమంటే పాలకులు మారడం కాదు.. సమాజంలో అసమానతలు పోయి ప్రతి మనిషి స్వేచ్ఛగా బతకడం అని చెప్పిన భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం పోరాడాల్సిన అవసరం నేటి విద్యార్థి, యువతరంపై ఉన్నదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఏపూరు గ్రామంలో భారత స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుక్‌దేవ్‌ల 93వ వర్ధంతిని పురస్కరించుకుని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇప్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు మున్నా అశోక్, పవన్, గ్రామ కార్యదర్శి వెంకన్న పాల్గొన్నారు.